క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం సత్యనారాయణ

మామిడికుదురు: ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని అడిషినల్ డీపీఎం సత్యనారాయణ తెలిపారు. ఆయన ఈదరాడలో ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన పంటలను ఆదివారం పరిశీలించారు. పంచగవ్య స్ప్రేయింగ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో 25 లీటర్ల పంచగవ్య స్ప్రేయింగ్ చేయాలన్నారు. దీని వల్ల గింజ గట్టిపడ్డి దిగుబడి పెరుగుతుందన్నారు. దీని వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. రైతులు ప్రకృతి సాగు విధానంలో పంటలు పండించాలన్నారు. కార్యక్రమంలో రైతులు యెరుబండి లక్ష్మయ్య, యెరుబండి ఫణిరామ్, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది కుడుపూడి జానకి, చెల్లుబోయిన రాధ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి

మామిడికుదురు: సొసైటీలు రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. పాశర్లపూడి సొసైటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. చైర్మన్‌గా మంద గాంధీ, డైరెక్టర్లుగా బొంతు మహాలక్ష్మి నాగకుమారి, యర్రంశెట్టి దుర్గా రాజేశ్వరి ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీలు సకాలంలో ఎరువులు, విత్తనాలు, పంట రుణాలు రైతులకు అందించి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, నేతలు జాలెం శ్రీనివాసరాజు, కొనుకు నానగరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాల బాలాజీకి రూ.1.53 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి ఆలయానికి ఆదివారం భారీగా భక్తులు వచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. బాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.1,53,667 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. స్వామి వారి నిత్య అన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.48,533 విరాళాలుగా అందించారన్నారు. 2,300 మంది స్వామి వారిని దర్శించుకున్నారన్నారు. ఏలూరుకు చెందిన నక్కిన శివనాగమయ్య, పద్మావతి దంపతులు బాల బాలాజీ స్వామి నిత్య అన్నదానం ట్రస్టుకు రూ.10,116 విరాళంగా అందించారు. విరాళం అందించిన దాతకు ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్ర పటం, ప్రసాదాలు అందించారు.

ఉపాధ్యాయులకు సత్కారం

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం మధ్య గ్రూపు మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పాఠశాల భవన నిర్మాణంలో, దాతల సహకారంతో పాఠశాలల అభివృద్ధికి కృషి చేయడంలో, విద్యార్థుల నమోదు శాతం పెంచడంలో చొరవ చూపిన 11 మంది ఉపాధ్యాయులకు ఎంఈవో-2 మద్దాలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీస్వర్ణభారతి సాహిత్య కళావేదిక అధ్యక్షుడు దొండపాటి రాజారావు నేతృత్వంలో సత్కరించారు. వీరితో పాటు యోగా గురువు మన్నే సత్యనారాయణను కూడా సన్మానించారు. పాఠశాల హెచ్ఎం నరహరిశెట్టి సత్యనారాయణ, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవ– గోపాలస్వామి వారి ఆలయం అన్న ప్రసాద పథకానికి భక్తులు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. దానిలో భాగంగా ఆదివారం హైదరాబాద్‌కు చెందిన పతెం హేమచంద్ర వెంకట శ్రీసత్య శశాంక్ – స్నిగ్ధశ్రీ రూ.25,116 విరాళంగా సమర్పించారు. దాతలకు దేవస్థానం తరఫున అధికారులు, వేద పండితులచే ఆశీర్వచనం అందించి, స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, చిత్ర పటాలను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కొత్తపేట: స్థానిక ఏనుగుల మహల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జి.బాపనయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రపురం మండలం వెల్ల గ్రామానికి చెందిన బాపనయ్య తన భార్య, కుమార్తెతో కలిసి ఆదివారం అంబాజీపేటలో ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. తిరిగి బైక్‌పై వస్తుండగా కొత్తపేట శివారు ఏనుగులమహల్ వద్దకు వచ్చే సరికి వారిని అధిగమించి వెళుతున్న వ్యాన్ కొక్కెం తగులుకుని పడిపోయారు. ఈ ప్రమాదంలో బాపనయ్య తీవ్రంగా గాయపడగా.. వెంటనే 108 అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం ఉన్నత వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పశు బీమాపై పట్టింపేది?

- పాడి రైతుకు కరవైన భీమా
- పశువులు మరణిస్తే అందని ఆర్థిక సాయం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



పొలంలో గడ్డి మేస్తున్న పశువులు

కొత్తపేట: పాడి రైతులకు అండగా ఉండే పశు బీమా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. పాడిని, పాడి పశువులనే నమ్ముకొని జీవనం సాగించే రైతులకు పశు బీమా సౌకర్యం లేక అయోమయ పరిస్థితులకు లోనవుతున్నారు. వర్షాకాలంతో పాటు ఊహించని విపత్తులతో పశువులు మృత్యువాత పడితే ఆ సమయంలో పశు బీమా కొంత ఊరటనిచ్చేది. అయితే, అలాంటి బీమాపై కూటమి ప్రభుత్వం స్పష్టత నివ్వక పోవడంతో పాడి రైతులు బీమా పథకం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్ ఘాతాలు, ప్రకృతి వైపరీత్యాలు, రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు పశువులు మరణించే అవకాశాలుంటాయి. వాటికి తోడు గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలకు గాలికుంటు తదితర వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. కొన్ని ప్రాణాంతక వ్యాధులు సోకడం వల్ల పశువులు మృత్యువాత పడుతుంటాయి. వాటికి బీమా లేకపోతే పాడి రైతులు నష్టపోయే పరిస్థితి.

వైఎస్సార్ సీపీ హయాంలో..

గత ప్రభుత్వం తొలుత బీమాతో సంబంధం లేకుండా పశు నష్టపరిహార పథకం అమలు చేసి ఏ పశువు మరణించినా రూ.30 వేలు పరిహారం అందించి రైతును ఆదుకునేది. తరువాత పశు బీమా పథకాన్ని పక్కాగా అమలు చేసింది. ప్రభుత్వం తరఫున పశు వైద్యాధికారులు ఇచ్చిన సర్టిఫికెట్ ఆధారంగా ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించేవారు. ఉదాహరణకు పాడి పశువుకు రూ.1,800 ప్రీమియం నిర్దేశిస్తే ప్రభుత్వం రూ.1,400 రాయితీ కల్పించి (రైతు తరఫున ప్రభుత్వమే చెల్లించేది) మిగిలిన రూ.400 రైతు చెల్లించగా.. పశువు విలువను బట్టి బీమా పరిహారం అందేది. ఆ విధంగా గత ప్రభుత్వం పాడి రైతులకు పరిహారం అందించి ఆదుకుంది. దీని వల్ల రైతుకు కొంత ఉపయోగంగా ఉండేది. క్షీర సార పథకం ద్వారా 6, 7 నెలల చూడితో ఉన్న గేదె, ఆవుకు బీమా సౌకర్యం ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏ విధమైన బీమా గాని, పశు నష్టపరిహార సౌకర్యం గాని లేకపోవడంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. పశు బీమాపై ఇంతవరకు ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం శోచనీయం. ఇది పాడి రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, చిన్నచూపును తేటతెల్లం చేస్తుంది.

బీమా సౌకర్యం కల్పించాలి



ప్రభుత్వం పశువులకు బీమా సౌకర్యం కల్పించి పాడి రైతులను ఆదుకోవాలి. గత ప్రభుత్వం పశు నష్ట పరిహారం, పశు బీమా పథకాలు అమలు చేసింది. ప్రమాదవశాత్తు పశువులు మృతి చెందితే ఆయా పథకాల ద్వారా రైతులకు పరిహారం అందేది. ప్రస్తుతం ఒక పాడి గేదెను కొనాలంటే రూ.లక్షన్నర వెచ్చించాల్సి వస్తుంది. పశు పోషణ కూడా భారంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో బీమా సౌకర్యం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ఉచిత పశు బీమా పథకం అమలు చేయడంతో పాటు రాయితీపై దాణా పంపిణీ చేయాలి.

– పెదపూడి బాపిరాజు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు, వాడపాలెం.

రాష్ట్ర అనుబంధ విభాగాల సారథుల నియామకం



దొమ్మేటి వెంకట్రావు



కోనాల రాజు



వనుము సత్యకళ్యాణి



మట్టపర్తి మీరాసాహెబ్ శెట్టి



వాసంశెట్టి తాతాజీ



కాకిలేటి శ్రీనివాస్

కొత్తపేట: రాష్ట్ర వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు సంబంధించి మూడు కమిటీల్లో కొత్తపేట నియోజకవర్గం నుంచి ముగ్గురికి స్థానం లభించింది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సారథ్యంలో జిల్లా పార్టీ అన్ని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ రాష్ట్రంలోనే ఉత్తమ జిల్లా పార్టీగా గుర్తింపు పొందింది. పార్టీ కోసం సైనికుల్లా పనిచేసే నాయకులను జగ్గిరెడ్డి గుర్తించి వివిధ పదవులకు అధిష్ఠానానికి సిఫార్సు చేశారు. వివిధ విభాగాలకు సంబంధించి అధిష్ఠానం ఇప్పటికే అనేక మంది నాయకులకు పదవులు ప్రకటించింది. తాజాగా రాష్ట్ర ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం జాయింట్ సెక్రటరీగా కొత్తపేటకు చెందిన రిటైర్డ్ ఎంఆర్ఓ. దొమ్మేటి వెంకట్రావు, రాష్ట్ర ఆర్టీఐ విభాగం సెక్రటరీగా రావులపాలెం మండలం కొమరాజులంకకి చెందిన కోనాల రాజు, రాష్ట్ర గ్రీవియన్స్ విభాగం సెక్రటరీగా ఆలమూరు మండలం పెనికేరుకి చెందిన వనుము సత్యకళ్యాణి నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీల్లో స్థానం పొందిన పై నాయకులు మాట్లాడుతూ, చిర్ల జగ్గిరెడ్డి ఎంతో నమ్మకంతో తమను గుర్తించి ఆయా పదవుల్లో నియమించారని, పార్టీ అభ్యున్నతికి పాటుపడతామన్నారు.

వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా 'శెట్టి'

అంబాజీపేట: వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మట్టపర్తి మీరాసాహెబ్ శెట్టి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం తాడేపల్లి నుంచి ఆదివారం ఆదేశాలు వెలువడ్డాయి. పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగిందని పేర్కొన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని శెట్టి చెప్పారు.

ఇద్దరికి వైఎస్సార్ సీపీలో కీలక పదవులు

అయినవిల్లి: మండలంలోని ఎస్.పెదపాలెనికి చెందిన వాసంశెట్టి వీరవెంకట తాతరావు (తాతాజీ)కి వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా, అలాగే అయినవిల్లికి చెందిన కాకిలేటి శ్రీనివాసరావుకు రాష్ట్ర వైఎస్సార్ సీపీ అఫ్లీలేటడ్ వింగ్ కమిటీ జాయింట్ సెక్రటరీగా నియమితులైయ్యారు. ఈ మేరకు వీరికి పార్టీ నుంచి ఆదివారం ఉత్తర్వులు అందాయి. వాసంశెట్టి తాతాజీ, కాకిలేటి శ్రీనివాస్‌లను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పి.గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అభినందించారు. తమకు ఈ పదవి రావడానికి కృషి చేసిన చిర్ల జగ్గిరెడ్డి, గన్నవరపు శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు వీరిని అభినందించారు.

మానవ ఐక్యత ఆర్ఎస్ఎస్ లక్ష్యం

కొత్తపేట: హిందూ సమాజం, మానవ ఐక్యత, ప్రపంచ సంక్షేమం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) లక్ష్యమని ఆర్ఎస్ఎస్ కంద విభాగ సభ్యుడు గన్నవరపు అమ్మిరాజు అన్నారు. ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి 100 ఏళ్లు పూర్తైన సందర్భంగా వివిధ క్షేత్రాల సమావేశం ఆదివారం స్థానిక గ్రామ దేవత బంగారమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. కండ సంచాలక్ తొగరు ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అమ్మిరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, భారతదేశాన్ని ఒక సంఘటిత, శీలసంపన్న, శక్తివంతమైన దేశంగా వైభవస్థితికి తీసుకెళ్లడానికి డాక్టర్ హెగ్డేవార్ 1925లో రాష్ట్రీయ స్వయం సేవక సంఘ కార్యాన్ని ప్రారంభించారని తెలిపారు. నాటి నుంచి దేశం క్లిష్ట సమయంలో ఆర్ఎస్ఎస్ సేవా దృక్పథంతో పనిచేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ దేశం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, మండల బీజేపీ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు, రాష్ట్ర యువమోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్ నారాయణ, బాల ఆర్ఎస్ఎస్ కశిరెడ్డి తన్విక్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిల సమస్యలు పరిష్కరించాలి



ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ సభ్యుల నినాదాలు

రావులపాలెం: పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, పీఆర్సీ కమీషన్ ఏర్పాటు, ఐఆర్ ప్రకటన, సరెండర్ లీవ్స్ బిల్లు చెల్లింపు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ ఎన్జీవో కొత్తపేట తాలూకా యూనిట్ కార్యవర్గ సమావేశంలో సభ్యులు తీర్మానం చేశారు. స్థానిక మండల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం ఏపీ ఎన్జీవో కొత్తపేట తాలూకా యూనిట్ కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు మోటూరి రామారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ఏపీ ఎన్జీవో మాజీ అధ్యక్షుడు, జిల్లా ఉద్యోగుల సంఘం సమన్వయకర్త మాధవరపు వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డీఏ బకాయిలు, సరెండర్ లీవుల బకాయిలు, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు ఐఆర్ ప్రకటన తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే కోనసీమ జిల్లా సంఘ కార్యకలాపాలను విస్తరణ చేయడంలో భాగంగా జిల్లా అడహక్ కమిటీ ఏర్పాటు ఈనెల 9న జరగనున్నట్టు, ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకత్వం వస్తుందన్నారు. సమావేశంలో కొత్తపేట ఏపీఎన్జీవో మాజీ అధ్యక్షుడు కొవ్వూరి ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి నల్ల రామారావు, సహా అధ్యక్షుడు ఏపుగంటి సురేష్, కోశాధికారి శామ్యూల్ రాజు, సభ్యులు చంద్రశేఖర్, ఏఎస్ఎం అనసూయ తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థిక సాయం

అంబాజీపేట: కిడ్నీ వ్యాధికి గురై ఆరోగ్య ఇబ్బందులతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితుడికి పలువురు ఆర్థిక సాయంతో పాటు నిత్యవసర సరకులను అందజేశారు. మండలంలోని మాచవరం పంచాయతీ కార్యాలయం సమీపంలో నివాసముంటున్న పితాని ఏసుకుమార్ కొన్నాళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో కోకో ఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి, పంచాయతీరాజ్ డీఈ అన్యం రాంబాబు, అరిగెల రాంబాబు, అరిగెల కృష్ణప్రసాద్‌లు రూ.25 వేలు, రాజోలుకు చెందిన బోనం రాజు, సూరపురెడ్డి సురేష్‌లు రూ.6,500, రూ.3 వేలు విలువైన కిరణా సరకులు అందజేశారు. కార్యక్రమంలో నల్లా పెద్దకాపు, అరిగెల నాని పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాల సాధనకు విద్యార్థులు కృషి చేయాలి



విద్యార్థులకు వేతనాలు పంపిణీ చేస్తున్న తులసీ రామచంద్ర ప్రభు, కాత్వా ప్రతినిధులు

అమలాపురం రూరల్: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి కోసం నిరంతరం కృషి చేయడం ద్వారా అత్యుత్తమైన సమాజాన్ని తద్వారా శక్తివంతమైన దేశాన్ని నిర్మించగలమని తులసి సీడ్స్ అధినేత తులసీ రామచంద్ర ప్రభు ఉద్బోధించారు. అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్‌లో ఆదివారం కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపకార వేతన పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా విద్యార్థులకు రూ.22 కోట్లు ఉపకార వేతనాలను పంపిణీ చేశామని తెలిపారు. కోనసీమ జిల్లాలో 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, వైద్య విద్యలో ప్రతిభ కనపరిచిన 650 మంది విద్యార్థులకు ఆయన ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. గతేడాది 10వ తరగతిలో పరీక్షల్లో 596 మార్కులు సాధించిన పెద్దిరెడ్డి మోహనకృష్ణ సాత్విక్‌కు హైదరాబాద్ ఆలివ్ స్వీట్స్ అధినేత ఆలివ్ దొర రాజు రూ. లక్ష నగదు పురస్కారాన్ని అందించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందం మాట్లాడుతూ చిన్నారులు ఉన్నత విద్యనభ్యసించి సమాజానికి అద్భుతమైన వనరులుగా తయారు కావాలన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ రూ.50 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేసిన కాత్వా సభ్యులను అభినందించారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, బండిగుప్తావు పాండురంగ తదితరులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిట్నీడి నిరంజన్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు తాడి నరసింహారావు, రవణం స్వామినాయుడు, ఆకుల రామకృష్ణ, కాత్వా వ్యవస్థాపక అధ్యక్షుడు కొల్లా నారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు లీలా మాధవరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిక్కం మైనర్ బాబు, కోనసీమ అధ్యక్షుడు మేడిచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నందెపు శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి గంగ్రోతు నాగేశ్వరరావు, దంగడమే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలు అదరహో

- అలరించిన అమలాపురం శ్రీదేవి దసరా భారీ ఊరేగింపు
- 150 మంది కళాకారులతో ప్రదర్శనలు



భూత, బేతాళ, శక్తి వేషాల ప్రదర్శన

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీదేవి అమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలో ఆదివారం నిర్వహించిన అమ్మవారి నిమజ్జన ఊరేగింపును పుర వీధుల్లో వైభవంగా నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పది రకాల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రజలకు విశేషంగా ఆకట్టుకున్నాయి. దాదాపు 150 మంది కళాకారులు ఈ సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్నారు. అన్ని ప్రదర్శనలు అదరహో రీతిలో సాగాయి. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన 40 మంది కళాకారులతో భూత, బేతాళ సెట్ ప్రదర్శన ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ గిరిజన కొమ్ము, కోయ బృందం (థింసా నృత్యం), విజయవాడకు చెందిన 13 మంది కళాకారులతో కాళి నృత్య ప్రదర్శన, గరగ నృత్యాలు, బుట్ట బొమ్మలు, కర్ర బొమ్మలు, కోతి డ్యాన్స్, 20 మంది కళాకారులతో జానపద డప్పుల నృత్యం, సినీ మ్యూజికల్ బ్యాండ్‌లు, వాహన ఫ్లవర్ డెకరేషన్ ఈవెంట్ ఇలా పలు ప్రదర్శనలు ప్రజల్లో వినోదాన్ని నింపుతూ ఊరేగింపు సాగింది. ముఖ్యంగా నరసింహావతారంతో రాక్షసుడిని సంహరిస్తున్న ప్రదర్శన చూపురులను గగుర్పాటుకు గురిచేసింది. యువత కేరింతల మధ్య భారీ ఊరేగింపు ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు, కమిటీ ప్రతినిధులైన మాజీ కౌన్సిలర్లు ఆశెట్టి ఆదిబాబు, మామిడిపల్లి రాంబాబు, జీవి తదితరులు పర్యవేక్షించారు. తొలుత శ్రీదేవి అమ్మ ఆలయం వద్ద నుంచి మొదలైన ఊరేగింపు ముస్లిం వీధి, హైస్కూలు రోడ్డు సెంటరు, గడియారం స్తంభం సెంటరు, ముమ్మిడివరం గేటు సెంటరు, అశోక్‌నగర్ తదితర వీధుల్లో సాగింది. ఆదివారం సాయంత్రం నుంచి మొదలైన ఊరేగింపు సోమవారం తెల్లవారు జాము వరకూ నిర్విరామంగా సాగింది.



నరసింహావతారంతో రాక్షస సంహారం



ఊరేగింపులో వినోదాన్ని పంచిన గిరిజన థింసా నృత్యం



అమలాపురంలో హోరెత్తిన శ్రీదేవి అమ్మవారి దసరా ఊరేగింపు

వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా సత్యకుమార్

అమలాపురం టౌన్: వేంకటేశ్వరస్వామి దేవస్థానం కొత్త ఈవోగా పీవీవీ సత్యకుమార్ నియమితులయ్యారు. పలు దేవాలయాల్లో సూపరింటెండెంట్‌గా పనిచేసిన సత్యకుమార్ గ్రేడ్-1 ఈవోగా పదోన్నతి పొంది తొలిసారిగా అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈయన కాకినాడ అన్నదానం సమాజం సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ అమలాపురానికి పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈయన గతంలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఇన్‌చార్జి ఈవోగా పనిచేసిన యర్రా వెంకటేశ్వరరావు రిలీవ్ కానున్నారు. తాళ్లరేవు గ్రూపు దేవాలయాల ఈవోగా పనిచేస్తూ ఈయన అదనపు బాధ్యతలతో అమలాపురం ఈవోగా సేవలందించారు. ఇప్పుడు రెగ్యులర్ ఈవో రావడంతో వెంకటేశ్వరరావు తాళ్లరేవు గ్రూపు దేవాలయాల ఈవోగా విధులు నిర్వర్తించనున్నారు. కొత్త ఈవోగా సత్యకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

హెల్మెట్ ధరించాలి

తాళ్లరేవు: ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ హెచ్చరించారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని కాకినాడ–యానాం జాతీయ రహదారిలో పి.మల్లవరం చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించి, వాహనదారులకు అవగాహన కల్పించారు.

వ్యక్తి ఆలోచనతో ఆర్ఎస్ఎస్ ఆవిర్భావం



పాశర్లపూడి సమావేశంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

మామిడికుదురు: ఒక వ్యక్తి ఆలోచన నుంచి ఆవిర్భవించిన ఆర్ఎస్ఎస్ నేడు 75 వేల శాఖలుగా విస్తరించిందని కోనసీమ జిల్లా ప్రచారక్ స్వరూప్ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ శత సంవత్సరాల విజయదశమి వేడుక ఆదివారం పాశర్లపూడి శ్రీపాశర్లపూడి సత్రంలో ఘనంగా జరిగింది. ఆర్ఎస్ఎస్‌లో ప్రస్తుతం 45 లక్షల మంది సభ్యులు ఉన్నారని పేర్కొన్నారు. దేశ సేవ కోసం ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు అనుక్షణం పోరాటం చేస్తున్నారన్నారు. ఆపదల నుంచి దేశాన్ని రక్షిస్తున్నారని చెప్పారు. తోరం సూర్యభాస్కర్‌తో పాటు పలువురు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ గణవేష్ దారులు 100 మంది యూనిఫాం ధరించి కార్యక్రమంలో పాల్గొన్నారు.

9న కాన్షీరామ్ వర్ధంతి



మలికిపురం పూలే, అంబేడ్కర్ భవనంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మలికిపురం: గన్నవరం నియోజకవర్గం పుల్లేటికూరులో ఈ నెల 9న ఏర్పాటు చేసిన బీఎస్పీ అధినేత కాన్షీరామ్ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాజోలు నియోజకవర్గ కార్యవర్గం పిలుపునిచ్చింది. ఆదివారం మలికిపురం పూలే, అంబేడ్కర్ భవనంలో ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు నల్లి ప్రసాద్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నాయకులు కోరారు. ఈ మేరకు వర్ధంతి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాబత్తుల సత్యం, రాష్ట్ర కార్యదర్శి బత్తుల లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు బూషి జాన్ మోషే ఆవిష్కరించారు. ఆకుమర్తి భూషణం, మోకా శ్రీనుబాబు, నల్లి సునీల్ పాల్గొన్నారు.

'భక్తి' జ్ఞాన జ్యోతిని వెలిగించాలి

అయినవిల్లి: అజ్ఞానాన్ని తొలగించి భక్తి అనే జ్ఞాన జ్యోతిని ప్రతి ఒక్కరిలో వెలిగించాలని, అది అదిదేవుడు శ్రీకృష్ణుని ఆశ్రయించడం వల్లే సాధ్యపడుతోందని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు ప్రభూజీ సుందర శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం నల్లచెరువు గ్రామంలో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ ప్రభూజీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ, శ్రీకృష్ణుడు విశ్వాంతర్యామి అన్నారు. ఆధ్యాత్మిక విద్యతోనే నిరంతరం తరించాలన్నారు. అప్పుడే శాంతి లభిస్తుందన్నారు. అనంతరం మందిరం వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

అన్నదానానికి విరాళం

నల్లచెరువు గ్రామానికి చెందిన నేదునూరు పీఏసీఎస్ చైర్మన్ వర్రే శ్రీనివాసరావు, గంగాభవాని మనవరాలు మేడిశెట్టి శ్రీయాన్సి పుట్టినరోజు సందర్భంగా రూ.5116లు విరాళం అందజేశారు. ఈ సొమ్మును ప్రభూజీ సుందర శ్రీనివాస్‌కు అందజేశారు. దాతను ఆలయ నిర్వాహకులు, భక్తులు అభినందించారు.

వచన కవితల పోటీలు

అంబాజీపేట: పట్టణంలోని అరిగెల బలరామమూర్తి సాహితీ కళా పీఠం ఆధ్వర్యంలో నిర్వహించే వచన కవితల పోటీలను కవులు సద్వినియోగం చేసుకోవాలని సాహితీ కళా పీఠం అధ్యక్షుడు అరిగెల బలరామమూర్తి కోరారు. అంబాజీపేట బస్ స్టేషన్ ఎదురుగా ఉన్న సాహిత్య కళావేదిక కార్యాలయంలో తృతీయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించారు. బలరామమూర్తి మాట్లాడుతూ, కళా పోషణలో భాగంగా కవులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఏటా సాహిత్య కళా వేదిక ఆధ్వర్యంలో వచన కవితల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కవితల పోటీల్లో రహదారి భద్రత– ప్రమాదాల నివారణ అంశానికి సంబంధించి 25 పంక్తులకు మించకుండా కవిత రాసి పంపాలన్నారు. కవితలు తమ సొంత రచన అని, దేనికి అనువాదం, కాపీ కాదని హామీ పత్రం జత చేయాలన్నారు. కవితలను ఆహ్వాన కమిటీ, అరిగెల బలరామమూర్తి సాహితీ కళా పీఠం, బస్ స్టేషన్ ఎదురుగా, అంబాజీపేట.. అనే చిరునామాకు పోస్టల్ లేదా స్వయంగా అందజేయాలని తెలిపారు. కవితల స్వీకరణ చివరి తేదీ అక్టోబర్ 31తో ముగుస్తుందని, ఎంపిక చేసిన కవితకు రూ.5,116లు నగదుతో పాటు, మెమొంటో, కవి సత్కారం జరుగుతుందని తెలిపారు.

వెరికోస్ చికిత్సకు వైద్య శిబిరం

అమలాపురం రూరల్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురంలో నిర్వహించిన వైద్య శిబిరంలో హైదరాబాదు ఏవీఎస్ హాస్పిటల్ సిబ్బంది వెరికోస్ వెయిన్స్ దశలు– చికిత్స విధానాలను ప్రజలకు వివరించారు. వేద నాచురల్స్ ఆళ్లగడ్డ పంచగవ్య ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు సూదా గణపతి ప్రారంభించారు. ఈ శిబిరంలో వంద మందికి వైద్య పరీక్షలు చేసి తగు సూచనలందించారు. మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్, సంతానలేమి, చర్మవ్యాధులు తదితర పలు రకాల వ్యాధుల నివారణకు ప్రాచీన సంప్రదాయ, భారతీయ వైద్య విధానాన్ని వివరించారు. ఈ శిబిరంలో ఏవీఎస్ హాస్పిటల్స్ డాక్టర్ బి.లావణ్య, కౌన్సిలర్ పి. భాను శ్రీ, శ్రీనివాస్, వేద నేచురల్స్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వి. నరేంద్రదేవ్, లయన్స్ క్లబ్ కార్యదర్శి బెహరా వీర హనుమంత రావు, అనిల్ కుమార్, రవణం వేణుగోపాల్ రావు, చిక్కాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.